


" "

.............

"పరంధామయ్యని, ఉన్నావటయ్యా ! ఏం చేస్తున్నావ్ ?"

"........."

"ఆఁ....ఏవీఁలేదు.... రఘురాంగారబ్బాయి నీకు తెల్సా ?"

"........."

"ఎలాంటి కుర్రాడు ?"

"........."

"ఆఁ....మనమ్మాయికి చూద్దామని...."

"........."

"ఆఁ....అలాగా....ఫర్వాలేదంటావా?"

"........."

"సరే మాట్లాడదాం...."

"........."

"ఉంటాను మరి...."

* * *

"........."

"రఘురాంని...."

"........."

"ఉన్నావా ? మరేం లేదూ, పరంధామయ్యగారి అమ్మాయి నీకు తెలుసా ?"

"........."

"ఆఁ ఎందుకూ కాదు.... మనబ్బాయికి ఆ అమ్మాయిని రైట్ చేద్దామని...."

"........."

"ఫర్వాలేదా ?"

"........."

"అహా. అలాగా....అయితే ఆలోచించమంటావా ?"

"........."

"అలాగే బాగా భోగట్టాచేసి ఆ తర్వాత మాట్లాడతాను...."

"........."

"సరే వుండు...."

* * *

ట్రింగ్....ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్...

"హలో రాజారావ్ స్పీకింగ్...."

"........."

"పరంధామయ్యా, నువ్వా ఏవిఁటి సంగతి....?"

"ఊఁ....తెలుసు. ఎందుకు ?"

"........."

"ఒహో అలాగా....ఫర్వాలేదు.... కాలేజీ కుర్రాడుకదా!"

"........."

"ఫర్వాలేదులే....ఈ కాలం కుర్రాళ్ళు ఆ మాత్రం అల్లరి చిల్లరగా వుండక పోరు...."

"........."

"నాకు తెలిసిందది....జాగ్రత్తగా ఆలోచించుకొని, కాస్త పరిశీలించి దిగు రంగంలోకి...."

"........."

"నిజవేఁ....పెళ్ళంటే నూరేళ్ళపంట.."

"........."

"ఉంటాను...."

* * *

ట్రింగ్....ట్రింగ్....

"హలో....నాయుడు స్పీకింగ్...."

"........."

"నువ్వా రఘురాం....నాయుడ్నే.... ఏమిటి విషయం ?"

"........."

"ఆ అమ్మాయికేవయ్యా? చదువుకుంది, కాలేజీ పిల్ల కాబట్టి నలుగురితో కలివిడిగా మసలుతుంది...."

"........."

"ఆఁ...ఫర్వాలేదు...ప్రొసీడ్ ఐసే...."

"........."

"ఆఁ....అలాగే చెయ్యి...నేనుంటాను.

* * *

"........."

"పరంధామయ్యని....రామానుజానివేనా?"

"........."

"ఆఁ....ఊ రకనే అనుకో....చిన్న విషయం...."

"........."

"రఘురాం గారబ్బాయి ఎలాంటివాడో నీకేమైనా తెల్సా ?"

"........."

"మనమ్మాయికి ఆ అబ్బాయిని చూద్దామని...."

"........."

"ఆఁ....పద్దంటావా ?"

"మరలాగైతే ఎందుకు ?"

"............"

"నిజమేఁ అనుకో....ఒక్కగా నొక్క కూతురు....కాస్త అన్ని విషయాలూ చూసుకోవాలి కదా !"

"............"

"మరో సంబంధం చూడమంటావా ?"

"............"

"అలాగేలే....మరి వుంటాన్నేను...."

*   *   *

"............"

"రఘురాంని మాట్లాడుతున్నాను...."

"............"

"బాగున్నావా సూరీ !"

"............"

"ఆఁ....ఏవీఁలేదు....పరంధామయ్యగారి అమ్మాయిని మా అబ్బాయి కిద్దా మను కుంటున్నారు...ఆ అమ్మాయి ఎలాంటిది?"

"............"

"అహ....అలాగా...."

"............"

"అంత మంచిది కాదంటావా ?"

"............"

"అలాగైతే ఎందుకు....?"

"............"

"సరే ఆలోచిస్తాను....నువ్వు ఫోన్ పెట్టెయ్ !"

*   *   *

క్రింగ్...క్రింగ్...క్రింగ్...క్రింగ్...

"హలో సుబ్బారావ్ స్పీకింగ్...."

"............"

"ఆఁ....సుబ్బారావునే లేవయ్యా ! ఏమి టిలా ఇంత రాత్రప్పుడు ఫోన్ చేశావ్ ?"

"............"

"అమ్మో ! ఆ అబ్బాయా ?....పోకిరీ కుర్రాడు...."

"............"

"ఒక్క కొడుకు....ఆస్తి ఐశ్వర్యాలు వుంటే వుండొచ్చు....కానీ, మనమ్మాయా అమాయకురాలు....అలాంటి కుర్రాడితో అంటేనాకు ఇష్టంలేదు...ఆపై నీ యిష్టం... ఆ అబ్బాయి తిరగని తిరుగుళ్ళు లేవు.... ఇంకేం ఆలోచించకు....ఆ విషయం మరచి పోయి మరో సంబంధం చూడు. తొందర పడి గొయ్యిలో పడ్డావంటే మళ్ళా పైకి రావడం కష్టం...."

"............"

"సరే వుంటాను...."

*   *   *

క్రింగ్...క్రింగ్...క్రింగ్...క్రింగ్...

"పరుశురామ్ స్పీకింగ్. ఎవరూ ?"

"............"

"ఎందుకూ ?"

"............"

"అహఁ అలాగ్గా ?"

"............"

"అడుగుతున్నావ్ గనక చెప్తున్నాను... వెయ్యి అబద్ధాలాడైనా ఆడి ఓ పెళ్ళి చెయ్య మన్నారు."

"............"

"దబ్బండి....ఒకత్తే కూతురు....కానీ తిరుగుళ్ళు ఎక్కువ....ఒకబ్బాయితో ఏకంగా సినిమాలు. బీచ్‌లూ. పికినిక్‌లూ నట....అలాంటి అమ్మాయి మనకు సరి పడదు....ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ సంబంధం విషయం ఎత్తకు....ఇంతవరకూ నువ్వు కాపాడిన వంశమర్యాదంతా బూడిదలో కలసి పోతుంది....ఆ తర్వాత నీ ఇష్టం.

"............"

"ఆఁ....వుంటాను.... నే చెప్పింది గుర్తుంచుకో...."

*   *   *

"ఒరెయ్ ! సాయంకాలం పెళ్ళి చూపు లకి వెళ్ళాలి.... ఆఫీస్ నుంచి వేగంగా వచ్చెయ్ !" అన్నాడు రఘురాం.

"అదేంటి నాన్నా ! మొన్న చూసిన అమ్మాయి బాగానే వుందికదా ! మళ్ళీ ఎందుకు పెళ్ళి చూపులు ?"

"నువ్వూరుకోరా ! ఆ అమ్మాయి మంచిది కాదట .... మగాళ్ళతో తిరుగు తుందిట విచ్చల విడిగా...."

"లేదు నాన్నా ! ఆ అమ్మాయి నాకు నచ్చింది...." స్థిరంగా అన్నాడు సురేష్.

"అందంవుంటే చాలదోయ్ ! గుణం కూడా వుండాలి...."


"గుణానికేం నాన్నా ! నేనూ, ఆ అమ్మాయి ప్రేమించుకున్నాం...."ఉన్నది కాస్తా చెప్పేశాడు సురేష్.

రఘురాం ఆశ్చర్యపోయాడు.... "ఈ కథెప్పుడు మొదలయ్యింది...? అలాంటి అమ్మాయితో సంబంధం కుదుర్చుకుంటే మన వంశ మర్యాద కాస్తా గంగపాలే !"

"ఏవిఁటి నాన్నా ! ఆ అమ్మాయి మంచిది కాదని మీకెలా తెల్సు ?"

"ఎలా తెలుసేమిటి .... భోగట్టా చేస్తే తెలిసింది...."

"హఁ....నాన్నా...లోకం అది...దాని నోటికొచ్చినట్టు కూస్తుంది...ఆ అమ్మాయి సంగతి నాకు తెలుసు . పెళ్ళి చూపులయ్యాక మేం కలుసుకున్నాం..." ప్రేమించు కున్నాం...ఆ అమ్మాయిని నేను. నన్ను ఆ అమ్మాయి పూర్తిగా అర్థం చేసుకున్నాం... ఆ అమ్మాయితో తిరిగినవాణ్ని నేనే ! ఆ అమ్మాయి స్నేహితులు, నా స్నేహితులు సరదాగా కలిసి మెలసి తిరిగేవాళ్ళం.... ఇప్పుడు మనం కాదంటే మీలాగే మిగిలిన వాళ్ళందరూ ఆ అమ్మాయిని మంచిదికాదని అంటారు.. అప్పుడు ఆ అమ్మాయి బతుకేం కావాలి ? ఆ అమ్మాయి గురించేమిటి ? నన్నుమాత్రం అనరా.... అమ్మాయిల్తో విచ్చలవిడిగా తిరిగేవాడ్నని.... ఆలోచిం చండి నాన్నా ! మంచి చెడ్డల్ని తెలుసుకోడం



నెమళ్ళ ముగ్గు

—పి. ఎల్. తులశమ్మ

కోసం మీరు చాలా ఆలస్యం చేశారు.... ఈ లోగా చూశారా ఎన్ని అనుమానాలో..మంచి తనం. మర్యాద మనకి మనమే పరిశీలించాల్సిన విషయం.. ఎవరి ద్వారానో తెలుసుకుంటే వాళ్ళిష్టమొచ్చినట్టు చెప్తారు...." ఇంకా ఆవేశంగా చెప్పుకున్నాడు సురేష్.

రఘురాం ఆలోచిస్తున్నాడు.... ఫోన్లో మాటలు.... ఇక్కడ కొడుకు మాటలు..

ఫోన్లో మాటలు రకరకాలుగా ఉన్నాయి.. కొడుకు పరిశీలించి చెప్తున్న మాటలు ఒక రకంగా వున్నాయి.... కాసేపు ఆలోచించి..

"సరే నీ ఇష్టం.... ప్రేమించుకొని అర్థం చేసుకున్న వాళ్ళు మీరు.... కాపురం చేయాల్సింది మీరు., నడు., వెళ్ళి వాళ్ళతో మాట్లాడి ఆ సంబంధమే ఖాయం చేసుకుందాం.." అన్నాడు రఘురాం.

